నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 12 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI

అరెకరం కూడా పారుతలేదు

నాకున్న మూడున్నర ఎకరాల్లో వరి నాటు పెట్టిన. పెట్టుబడికి 70 రూపాయలు అయినయి. నీళ్లు లేక రెండున్నర ఎకరాల పొలం ఎండిపోయింది. కిందటేడు ఒక్కటే బోరుతో పొలం మొత్తం పండించిన. ఇప్పుడు అరెకరం కూడా పారుతలేదు. భూమి మొత్తం నెర్రెలు వారింది. ఎండిన పొలాన్ని గొర్ల మేతకు ఇచ్చిన.
-రేకల నర్సింహ, రైతు, ఇస్మాయిల్‌పల్లి, కట్టంగూర్ మండలం

నీళ్లు లేక నరకం

నకిరేకల్ నియోజకవర్గంలో దుర్భర పరిస్థితులు

అడుగంటిన భూగర్భ జలాలు

- వట్టిపోతున్న బోర్లు, బావులు
- పంటల కోసం రైతుల భగీరథ యత్నాలు
- ఎన్ని బోర్లు వేసినా చుక్క నీరు పడదాయె
- పొట్ట దశలో వరిని కాపాడుకోలేక యాతన
- ట్యాంకర్ల ద్వారా నీళ్లు కొని పోస్తున్న రైతులు

ఎటుచూసినా ఎండిన చెరువులు.. వట్టిపోయిన బోర్లు, బావులు.. అడుగంటిన భూగర్భ జలాలు.. నెర్రెలు వారిన నేలలు.. ఎండిన పంటలు.. వేలకు వేలు పోసి వందల అడుగులు తవ్వినా పడని బోర్లు.. ఉన్న కొద్దొగొప్పో పంటను కాపాడుకోలేక నరకయాతన అనుభవిస్తున్న రైతులు.. ఇదీ ప్రస్తుతం నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలో వ్యవసాయం పరిస్థితి. కట్టంగూర్, రామన్నపేట, నార్కెట్‌పల్లి, ఇలా ఏ మండలంలో ఏ గ్రామ ఏ రైతును కదిలించినా కన్నీళ్లే రాలుతున్నాయి.

కట్టంగూర్, మార్చి 11 : కట్టంగూర్ మండలంలోని 22గ్రామాల్లో 20,400 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా.. ఎక్కడా పంటలు పూర్తి స్థాయిలో చేతికి వచ్చే పరిస్థితి లేదు. పానగల్ ఉదయసముద్రానికి పైభాగంలో ఉండే పిట్టంపల్లి, ఇస్మాయిల్‌పల్లి గ్రామాల్లో వెయ్యి వరి నాటు పెట్టగా, ఇప్పటికే సగానిపైగా ఎండిపోయింది. బ్రాహ్మణవెల్లెంల ఎత్తిపోతల పథకం అప్రోచ్ చానల్‌కు ఇక్కడికి కొద్దిదూరంలోనే ఉన్నా భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. పంటలను రక్షించుకునేందుకు ఒక్కో రైతు 400 నుంచి 500 ఫీట్ల వరకు రెండు నుంచి ఐదు బోర్లు వేసినా చుక్క నీరు కూడా పడడం లేదు. ఒక్క పిట్టంపల్లిలోనే గత వారం రోజుల్లో 45 బోర్లు కొత్తగా వేసినట్లు రైతులు చెప్తున్నారు. పక్కనే ఉన్న ఇస్మాయిల్‌పల్లిలో 55 బోర్లు వేసినట్లు బోర్ వెల్ సిబ్బంది తెలిపారు. చివరి ప్రయత్నంగా కొందరు రైతులు ఎకరాకు రూ.12వేలు చొప్పున ఖర్చు చేసి ట్యాంకర్ల ద్వారా మూడు తడుల్లో నీటిని చేసి పంటలకు అందిస్తున్నారు. ఎండిపోయిన పంటను పశువులు, గొర్రెల మేతకు వదిలి పెడుతున్నారు. ఎక్కడికక్కడ పంటలు ఎండిపోయినా వచ్చి పరిశీలించి వ్యవసాయాధికారి లేరని రైతులు వాపోతున్నారు.

కట్టంగూర్ మండలం

ఆరు బోర్లు వేసినా చుక్క నీరు పడలే

నేను పదెకరాల్లో వరి పంటను సాగు చేస్తే నీళ్లు లేకపోడంతో మొత్తం ఎండిపోయింది. పొట్టదశలో ఉన్న పంటను కాపాడుకునేందుకు ఫిబ్రవరి నెలలో 2లక్షల రూపాయలు లక్షలు అప్పు చేసి ఆరు బోర్లు వేయించినా చుక్కనీరు పడలేదు. కేసీఆర్ హయాంలో చెరువులు, కుంటల్లో నీరు చేరడంతో బోరు బావుల్లో పుష్కలంగా నీరు ఉండి పంటలు బాగా పండాయి. ఇప్పుడు పంట పెట్టుబడి, బోర్లు వేసేందుకు కలిపి ఆరు లక్షలకుపైగా అప్పు మీద పడింది. ఎట్ల తీర్చాలో తెలియడం లేదు. ఎండిన పొలంలో పశువులను మేపుతున్నా. ప్రభుత్వమే ఆదుకోవాలి.
-ముడిపల్లి శంకరయ్య, పిట్టంపల్లి, కట్టంగూర్ మండలం

నీళ్లు లేక వెలవెలబోతున్న కట్టంగూరు మండలంలోని పిట్టంపల్లి చెరువు

ట్యాంకర్‌తో నీళ్లు

రామన్నపేట : రామన్నపేట మండలంలో సుమారు 30 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా.. బోర్లు, బావులు అటుగంటడంతో ఇప్పటికే 1,500 ఎకరాల్లో పంట ఎండింది. ఎండలు ముదురుతున్న కొద్దీ పంట నష్టం పెరుగుతున్నది. చాలామంది రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పంటకు తడులు అందిస్తున్నారు. రామన్నపేట మండల కేంద్రానికి మహిళా రైతు మిర్యాల ప్రమీల రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, నాలుగైదు రోజుల నుంచి బోరు నీళ్లు చాలడం లేదు. దాంతో ట్యాంకర్‌కు రూ.800 చొప్పున రోజూ మూడు ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేసి పంటకు అందిస్తున్నారు. జనంపల్లి గ్రామానికి చెందిన రైతు బాలెం సైదులు సాగు చేసిన రెండెకరాల్లో వరిలో ఎకరంన్నర ఎండిపోవడంతో మేకలను మేపుతున్నాడు.



రామన్నపేట మండలం

రామన్నపేటలో వరి పొలానికి ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న మహిళా రైతు మిర్యాల ప్రమీల

సాగునీరు రాక.. కరెంట్ లేక!

బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు కింద ఎండుతున్న పంటలు

- లో ఓల్టేజీ సమస్యతో కాలిపోతున్న మోటార్లు
- కొత్తగూడెం రైతుల ఆవేదన
- ప్రాజెక్టు నింపి కాల్వలు తవ్వాలని డిమాండ్

నార్కట్‌పల్లి : నకిరేకల్ నియోజకవర్గంలోని బ్రాహ్మణ వెల్లెంల ఆవాస గ్రామమైన కొత్తగూడెంలోనూ బోర్లు తవ్విన రైతులు 'బోరు'మంటున్నారే తప్ప నీళ్లు పడడం లేదు. నార్కెట్‌పల్లి మండలంలోని ఈ గ్రామం బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు కింద భాగంలో ఉంటుంది. రిజర్వాయర్‌లో కొంత మేర నీళ్లు నింపినా కాల్వల తవ్వకం పూర్తి కాలేదు. దాంతో సాగునీటి వసతి కరువైంది. మరోవైపు భూగర్భజలాలు కూడా అడుగంటి బోర్లు పోయడం లేదు. కరెంటు కష్టాలు కూడా తోడవడంతో మోటార్లు కాలి వరి పైర్లు ఎండుతున్నాయి. రైతులు ఆర్థికంగా మరింత దెబ్బతింటున్నారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత త్రీ ఫేస్ విద్యుత్ వస్తున్నదని, అది కూడా సరిగ్గా ఇవ్వడం లేదని వాపోతున్నారు. బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టును నింపి కాల్వలు తప్పి తమ గ్రామానికి శాశ్వత సాగునీటి పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

నార్కట్‌పల్లి మండలం

ఎండిన వరి పొలాన్ని పశువులు, గొర్రెల మేతకు వదిలిపెట్టిన రైతు బుచ్చిరెడ్డి

500 ఫీట్లు బోరు వేసినా నీళ్లు పడలే

బోర్లలో నీళ్లు లేక కండ్ల ముందే పంట ఎండిపోతుంటే చాలా బాధగా పడ్డాం. నాది నాలుగెకరాల వరి ఎండింది. గతంలో 170 ఫీట్లు బోరు వేస్తే నీళ్లు పడేది. మొన్న మొన్న 500 ఫీట్ల వేసినా చుక్క నీరు పడలే. త్రీఫేజ్ కరెంటు సరిగ్గా లేక మోటార్లు కాలిపోయి కూడా ఇబ్బంది పడ్డాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.
-గల్లె శ్రీను, రైతు, బ్రాహ్మణవెల్లెంల

నీళ్లు పడని బోరు గుంతను చూపుతున్న రైతు గల్లె శ్రీను

ప్రాజెక్టు పక్కనే ఉన్నా పొలం ఎండింది

బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు మా బతుకులను బాగు చేస్తుందనుకుంటే ఇంకా సాగునీటి కష్టాలు తప్పడం లేదు. రెండెకరాల్లో వరి పెడితే ఎండిపోయింది. వచ్చీరాని కరెంటుతో మోటార్లు కాలి అదనంగా ఖర్చయినయి. బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు ద్వారా చెరువులు నింపి, కొత్తగూడెం భూములకు కాల్వల ద్వారా నీరు అందించాలి. విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలి.
-యానాల బుచ్చిరెడ్డి, రైతు, బ్రాహ్మణవెల్లెంల

బెల్టు షాపులు మూసివేయాలని రాఘవాపురం గ్రామస్తుల తీర్మానం

రాఘవాపురంలో సమావేశమై తీర్మానం చేసిన గ్రామస్తులు

బీబీనగర్, మార్చి 11 : బీబీనగర్ మండలం రాఘవాపురంలో బెల్టు షాపులు మూసి వేయాలని గ్రామస్తులు తీర్మానం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం గ్రామానికి చెందిన నాయకులు, ప్రజలు సమావేశమయ్యారు. బెల్ట్ షాపుల నుంచి మద్యం అమ్మితే అమ్మినవారికి రూ.25 వేల జరిమానా వేస్తామని, మద్యం అమ్మడం చూసి పట్టుకుని ఎవరైనా సమాచారం అందిస్తే వారికి రూ.5 వేలు బహుమతిగా అందజేస్తామని తీర్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ బెల్టు షాపుల్లో మద్యం విక్రయించడం ద్వారా యువకులు మద్యానికి బానిసలవుతున్నారని, రోగాల బారిన పడి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పొట్లోళ్ల శ్యామ్‌గౌడ్, బండారు ఆగమయ్యగౌడ్, బుయ్య కిశోర్‌గౌడ్, జక్కి నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ -2 ఫలితాల్లో కోదాడ వాసికి ఫస్ట్ ర్యాంకు

ఎన్. హర్షవర్ధన్‌రెడ్డి

కోదాడ, మార్చి 11 : రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన గ్రూప్– 2 పరీక్ష ఫలితాల్లో సూర్యాపేట జిల్లా కోదాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.రమణారెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డికి రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు వచ్చింది. 600 మార్కులకు గానూ హర్షవర్ధన్ 447.088 మార్కులు సాధించాడు. 7వ తరగతి వరకు ఖమ్మం కేంద్రీయ విద్యాలయంలో చదివిన హర్ష.. 8 నుంచి 10 వరకు విజయవాడలోని నలంద విద్యాలయంలో, ఇంటర్ శ్రీ చైతన్య కళాశాలలో చదివాడు. తాడేపల్లిగూడెంలోని నిట్ కళాశాలలో బీటెక్ చేశాడు. ఎలాంటి కోచింగ్ లేకుండానే ప్రణాళికా బద్ధంగా చదివి ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నాడు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డిని కేఆర్‌ఆర్ కళాశాల అధ్యాపకులు వేముల వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, పిచ్చిరెడ్డి, యాదగిరి, భీమారావు, రత్నకుమారి, రమేశ్‌బాబు, జి.నాగరాజు, గోపికృష్ణ, చంద్రశేఖర్, మమత, డీఎస్ రావు అభినందించారు.

తప్పుడు అఫిడవిట్‌పై నేడు విచారణకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య?

వివరణ ఇవ్వాలని కోర్టు ఆదేశం

యాదగిరిగుట్ట, మార్చి11 : 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్‌కు సమర్పించిన తప్పుడు అఫిడవిట్‌పై బుధవారం వివరణ ఇవ్వాలని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు హైదరాబాద్‌కు చెందిన స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఫర్ ఎక్సైజ్ కోర్టు గత నెల 14న నోటీసులు జారీ చేయగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బొడుసు మహేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని, బుధవారం విచారణకు హాజరుకావాలని కోరింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆలేరు ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరపున బీర్ల అయిలయ్య పోటీ చేసే క్రమంలో తప్పుడు అఫిడవిట్ సమర్పించారని పేర్కొంటూ 2024 మే 29న రాష్ట్ర ఎన్నికల కమిషనర్, జిల్లా కలెక్టర్, జిల్లా రిటర్నింగ్ అధికారులకు యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గొల్లగూడ గ్రామానికి చెందిన బొడుసు మహేశ్ యాదవ్ ఫిర్యాదు చేశారు. ఫామ్ 26లోని రూల్ 4 ఏకు సంబంధించి ఎన్నికల సమయంలో బీర్ల అయిలయ్య తప్పుడు అఫిడవిట్ సమర్పించారని పేర్కొన్నారు. దీంతోపాటు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు మూడు వారాల్లోగా ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారులను ఆదేశించింది. దీంతో స్పందించిన బీర్ల అయిలయ్య టైపింగ్ చేసే క్రమంలో తప్పు దొర్లిందని, తన భార్య పేరు పెళ్లి సందర్భంగా పేరు మారిందని తెలుపడంతోపాటు భూమి సర్వే నంబర్ తప్పుగా ఉందని వివరణ ఇచ్చారు. సెక్షన్ 1254ఏ ప్రతినిధి పీపుల్స్ యాక్టు 1951 ప్రకారం ఉల్లంఘన జరిగిందని, దీనిపై కోర్టులో దావా వేసుకోవచ్చని ఎన్నికల కమిషన్ ఫిర్యాదుదారుడు మహేశ్ యాదవ్‌కు సూచించింది. దీంతో జూన్ 2024లో హైదరాబాద్‌కు చెందిన స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఫర్ ఎక్సైజ్ కోర్టులో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేసినట్లు మహేశ్ తెలిపారు. బుధవారం కోర్టులో విచారణ జరుగుతుందని ఆయన వెల్లడించారు.

హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన మంగళవారం బీఆర్ఎస్ఎల్‌పీ సమావేశం జరిగింది. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు హాజరు రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న దృశ్యమిది.

బీఆర్ఎస్ఎల్‌పీ సమావేశంలో గుంటకండ్ల, కోటిరెడ్డి

రామన్నపేట మండలకేంద్రంలో ఎండిపోయిన పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి

- సాగర్ జలాలను తరలిస్తున్నా పట్టించుకోని జిల్లా మంత్రులు
- రైతులకు శాపంగా మారిన రేవంత్ పాలన
- ఎండి పోయిన వరి పొలాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, మార్చి11 : కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రను వీడి క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలు ఎండిపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం అందించాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. రామన్నపేట మండల కేంద్రంతోపాటు, కొమ్మాయిగూడెం గ్రామాల్లో మంగళవారం ఆయన నీళ్లు లేక ఎండి పోయిన వరి పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలను ఆంధ్రా ప్రాంతానికి తరలించుకోపోవడం వల్ల సాగర్ ఎండి పోయే ప్రమాదం ఉందన్నారు. ఉమ్మడి నల్లగొండ రైతాంగానికి తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉన్నప్పటికీ జిల్లాకు చెందిన మంత్రులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితులు నాటి చంద్రబాబు పాలనను గుర్తు చేస్తున్నాయని, ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డి పాలనలోనూ అలాగే జరుగుతున్నదని ఎద్దేవా చేశారు. ఇది కాలం తో వచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ పాలన తెచ్చిన కరువు అని విమర్శించారు. రైతు రుణమాఫీ సగం మందికి కూడా కాలేదని, రైతు భరోసా లేదని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొని ఉంటే పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా లేదా అనే అనుమానం వ్యక్తం అవుతుందని చెప్పారు. రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రేవంత్ పాలనకు చరమగీతం పాడి కేసీఆర్ పాలనకు స్వాగతం పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోశబోయిన మల్లేశం, మాజీ ఎంపీపీ నీల దయాకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు బొక్క మాధవరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బద్దుల ఉమారమేశ్, మాజీ ఎంపీటీసీలు గొరిగె నర్సింహ, సాల్వేరు అశోక్, పున్న వెంకటేశం, దోమల సతీశ్, నాయకులు బత్తులవెంకటేశం, ఎస్‌కే చాంద్, రేఖ యాదయ్య, కూనూరు ముత్తయ్య, బండ శ్రీనివాస్ రెడ్డి, గర్దాసు విక్రం, జాడ సంతోష్, మిర్యాల మల్లేశం, ఆమేర్, ఆవుల శ్రీధర్, రామిని లక్ష్మణ్, బొడ్డుపల్లి రాజు, లవణం రాము, బాలగోని శివకుమార్, జెట్టి శివప్రసాద్, మద్దెపూరి పద్మయ్య, కడారి మల్లేశం ఉన్నారు.



యాదగిరిగుట్ట : మల్లాపురంలో ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఆ పార్టీ నాయకులు

నమ్మి పంటలు సాగు చేస్తే నీళ్లియ్యరా?

- పంటలెండిపోతే చూడవా?
- ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై మండిపడ్డ రైతులు
- ఎండిపోయిన పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

యాదగిరిగుట్ట, మార్చి11: 'ఓట్ల కోసం వచ్చి నీళ్లిస్తానన్నవ్.. నీ మాటలు నమ్మి వరి పంట లేసుకున్నం.. నీళ్లు రావాయె.. పంటలెండిపోయె.. మాకు చావే దిక్కా' అంటూ యాదగిరి గుట్ట మండలం మల్లాపురం గ్రామానికి రైతులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై మండిపడ్డారు. పంట లెండిపోయి రైతులు ఏడుస్తుంటే వచ్చి చూడవా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లాపురం గ్రామంలోని సురెండెం బావి ప్రాంతంలో సుమారు 25 మంది రైతులు తమకు ఉన్న 150 ఎకరాల్లో వరి సాగు చేశారు. గోదావరి జలాలు వస్తాయని, కాల్వల ద్వారా చెరువులన్నింటినీ నింపుతానని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చెప్పడంతో నమ్మి మొత్తం భూమిలో వరి వేశారు. కాల్వ నుంచి నీళ్లు వస్తాయని రెండెకరాల్లో వరి వేస్తే నీళ్లు రాలేదని మహిళా రైతు కర్రె మల్లమ్మ వాపోయింది. రెండు నెలలుగా బావివద్దే ఉంటున్నానని, చుక్క నీరు పారలేదని ఏడుస్తూ చెప్పింది. కరెంట్ కూడా సరిగ్గా ఉండడం లేదని, రుణమాఫీ కాలేదని, రైతు భరోసా ఇస్తలేరని కాంగ్రెస్ సర్కారుపై పలువురు రైతులు మండిపడ్డారు. నీళ్లు లేక, లోఓల్టేజీ సమస్యతో ఎండిపోయిందని మరో రైతు కర్రె మల్లయ్య తెలిపారు. అప్పు చేసి సాగు చేస్తే నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎండిపోయిన వరి పొలాలను పశువుల మేతకు వదిలాల్సిన పరిస్థితి వచ్చిందని ఆ ప్రాంతానికి చెందిన 25 మంది రైతులు వాపోతున్నారు.

ఎకరాకు రూ. 25 వేల పరిహారం ప్రకటించాలి : కర్రె వెంకటయ్య

మల్లాపురం గ్రామంలోని సురెండెం బావి ప్రాంతంలో మంగళవారం సాగునీళ్లు లేక, విద్యుత్ రాక ఎండిపోయిన సుమారు 150 ఎకరాల వరి పొలాలను బీఆర్ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఆ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను పరామర్శించారు. అనంతరం కర్రె వెంకటయ్య మాట్లాడుతూ తమ గ్రామానికి వచ్చి ఒకసారి వరి పంటలను పరిశీలించాలని రైతులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను వేడుకున్నారని, కానీ ఇప్పటి వరకు ఆయన రాలేదని అన్నారు. మల్లాపురం తమ అమ్మమ్మ వాళ్ల ఊరని, ఈ గ్రామాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎన్నికల సమయంలో బీర్ల అయిలయ్య హామీ ఇచ్చి విస్మరించారని తెలిపారు. నమ్మిన రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను గ్రామాల్లో తరిమితరిమి కొట్టే పరిస్థితులున్నాయని హెచ్చరించారు. నీళ్లు లేక ఎండిన వరి పొలాలకు ఎకరాకు రూ. 25 వేల నష్టపరిహారం ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్పందించకపోతే రైతులతో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. వారి వెంట బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ కన్వీనర్ ఒగ్గు మల్లేశ్, మాజీ వార్డు సభ్యుడు కర్ర చంద్రశేఖర్, రైతులు మోట శేఖర్, కర్రె రాజయ్య, శ్రీశైలం, వీరస్వామి, జంగయ్య, ఎల్లమ్మ, మంత్రి భిక్షపతి, దుద్దూరి సిద్దులు, కిష్టయ్య, చల్లూరి స్వామి తదితరులు ఉన్నారు.